



జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




గురువారం 26 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 297 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ఇంధన కొరతపై పుకార్లు నమ్మొద్దు టీపీడీఏ స్పష్టీకరణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ విడుదల చేసిన ప్రకటనలో దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఉందని ప్రచారం అవుతున్న వార్తలు పూర్తిగా తప్పుడు, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయని తెలిపింది. ఈ పుకార్ల ప్రభావంతో ప్రజలు అవసరం లేకుండా పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి ఎక్కువగా ఇంధనం నింపించుకుంటుండటంతో సాధారణ స్థాయితో పోలిస్తే 2.5 నుండి 3 రెట్లు అమ్మకాలు పెరిగి కొన్ని కేంద్రాల్లో తాత్కాలికంగా నిల్వలు తగ్గిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. అయితే దేశంలో ఎలాంటి ఇంధన కొరత లేదని, హెచ్పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని, సరఫరా వ్యవస్థ సాధారణంగానే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అదేవిధంగా పెట్రోల్, డీజిల్‌ను కేన్లలో నిల్వ చేయడం పేసో నిబంధనలకు విరుద్ధమని, ఇది ప్రమాదకరమై అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించింది. ప్రజలు పుకార్లను నమ్మకుండా, అవసరానికి మించిన కొనుగోళ్లు చేయకుండా, అనధికారిక పాత్రల్లో ఇంధనాన్ని నిల్వ చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.




## 2బిహెచ్‌కె కేటాయింపులు పూర్తి – లక్షల ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశాలు త్వరలో

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి 24 గంటల్లో ఫిర్యాదులకు స్పందిస్తామని వెల్లడించారు. గతంలో అసంపూర్తిగా మిగిలిన ఇళ్లలో పెద్దఎత్తున పనులు పూర్తి చేస్తున్నామని, జిహెచ్ఎంసీ పరిధిలో వేలాది ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇండ్లలో లబ్ధిదారులు చేరకపోతే సమీప ప్రాంతాల అర్హులైన పేదలకు కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మార్చి 31 నాటికి సుమారు 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్లు పూర్తై గృహప్రవేశాలు జరగనున్నాయని, జూన్ నాటికి మరో లక్ష ఇండ్లు పూర్తవుతాయని ప్రకటించారు. అదేవిధంగా రెండవ విడతలో మరిన్ని ఇండ్ల మంజూరు చేపడతామని, పాత కాలనీలకు మౌలిక సదుపాయాలు, జర్నలిస్టుల కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.



## ఎల్‌పీజీ, పెట్రోల్ కొరత లేదు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ, సహజ వాయు, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యత, సరఫరాపై కేంద్ర పెట్రోలియం సహజ వాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ బుధవారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌పీజీ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ వంటి అవసరమైన ఇంధనాల ఉత్పత్తి, నిల్వలు, సరఫరా సక్రమంగా కొనసాగుతున్నాయని, డిమాండ్‌కు అనుగుణంగా తగిన నిల్వలు ఉంచి సమయానుకూలంగా పంపిణీ చేయాలని కేంద్రం సూచించింది. పెట్రోల్, గ్యాస్ కొరతపై వస్తున్న తప్పుడు సమాచారాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరం లేని భయంతో అధికంగా బుకింగ్ చేయవద్దని హెచ్చరించింది. పట్టణాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిలోనే ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్ నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. గ్యాస్ నెట్‌వర్క్ విస్తరణతో పైప్ ద్వారా వచ్చే సహజ వాయువు (పిఎన్‌జి) వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచిస్తూ, రాష్ట్రాలు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టాలని ఆదేశించింది. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల నేతన్నల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ విజ్ఞప్తి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న రూ.38 కోట్ల విద్యుత్ భారం రద్దు చేయాలని, బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌ఛార్జీలను పూర్తిగా మాఫీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సిరిసిల్ల నేతన్నల సమస్యలను వివరించారు. పాత బకాయిలతో సంబంధం లేకుండా వస్త్ర పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలని, కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యల బాట పడకుండా తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుకలో ప్రముఖుల సందడి



సందేశం టైమ్స్, గుంటూరు, మార్చి 26, ప్రతినిధి: టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుక గుంటూరులో ఘనంగా జరిగింది. శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంతో కలిసి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లకు పుష్పగుచ్ఛం అందించి వారి వైవాహిక జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టుపై క్రెడిట్ దోపిడీ ఆరోపణలు



సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 26, ప్రతినిధి: ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ అంశంలో క్రెడిట్ దోపిడీ జరుగుతోందని ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పించారు. 2022లో దావోస్ పర్యటన సందర్భంగా ఆర్సెలర్ మిట్టల్ ప్రతినిధి ఆదిత్యా మిట్టల్‌తో సమావేశమై రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆహ్వానించామని పేర్కొన్నారు. అప్పట్లోనే సంస్థ నక్కపల్లి ప్రాంతాన్ని ఎంపిక చేసుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును తమ కృషిగా చూపించుకోవడం తగదని, వాస్తవాలను వక్రీకరించవద్దని చంద్రబాబుపై విమర్శలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి అంశాల్లో రాజకీయ క్రెడిట్ కోసం పోటీ కాకుండా పారదర్శకత అవసరమని వ్యాఖ్యానించారు.



## దివ్యాంగులు, మరుగుజ్జు వర్గాల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది: తీన్మార్ మల్లన్న


సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద దివ్యాంగులు, మరుగుజ్జు వర్గాలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిరసనలో పాల్గొన్న ఆయన శరబత్ నీళ్లు అందించి సంఘీభావం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు, మరుగుజ్జు వర్గాల వంటి వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారి హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ముందుగా దివ్యాంగులకు పథకాలు అమలు చేసిన తర్వాతే ఇతరులకు అమలు చేయాలని, అదే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు సృష్టించే సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని విమర్శిస్తూ బీసీలు చైతన్యవంతులై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మరుగుజ్జు సంఘాల నాయకులు, టిఆర్పీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రలో భారీ స్టీల్ ప్లాంట్ – అభివృద్ధికి కొత్త దిశ




సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 26, ప్రతినిధి: ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. రూ.1.36 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రను ఉక్కు కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ముందడుగు వేస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టుతో యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన ప్రోత్సాహం లభిస్తుందని వివరించింది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అనుమతులు, ముడి ఖనిజ సరఫరా వంటి అంశాల్లో వేగవంతమైన చర్యలు తీసుకోవడం వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని పేర్కొంది. విశాఖ ఉక్కు పరిశ్రమ తర్వాత ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఈ ప్లాంట్ కొత్త దిశను చూపిస్తుందని, వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ఫలితాలు కనిపిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# భద్రాచలం రామాలయం అభివృద్ధికి రూ.351 కోట్లు మంజూరు




సందేశం టైమ్స్, భద్రాచలం, మార్చి 26, ప్రతినిధి: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం పునరాభివృద్ధి, పునరుజ్జీవన పనుల కోసం తొలి విడతగా రూ.351 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ జీవో ఆర్.టి నెం.167 ద్వారా పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం రూ.586 కోట్ల అంచనాతో మూడు దశల్లో రామాలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆలయ పరిసరాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. రామాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు



## జర్నలిస్టుల 'ఛలో హైదరాబాద్'తో సమాచార భవన్ దద్దరిల్లింది

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న వివక్షను నిరసిస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పిలుపుతో నిర్వహించిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం (సమాచార భవన్)ను జర్నలిస్టులు ముట్టడించారు. వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి, అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నినాదాలతో ప్రాంతాన్ని దద్దరిల్లించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని, బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిందని, ఇళ్ల స్థలాలు, పెన్షన్ల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంపానెల్మెంట్, ప్రకటనల బిల్లుల చెల్లింపులు జరగడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పీఆర్ డైరెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు – కలెక్టర్ హెచ్చరిక

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 26, ప్రతినిధి: జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో ఎస్పీ కె. నరసింహతో కలిసి ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణా వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్ నమోదు చేపట్టాలని, ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ రవాణా నియంత్రణ కోసం పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల సమన్వయంతో ప్రత్యేక మొబైల్ టీంను ఏర్పాటు చేయాలని, జిల్లాలోని రీచ్‌లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఆమోదం పొందిన ఇసుక ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అమర్చడంతో పాటు సీసీ, ఏఎన్పీఆర్ కెమెరాల ద్వారా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని, అనధికార వాహనాలను గుర్తించి బ్లాక్ చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి మాన్యువల్ విధానం రద్దు చేసి ఆన్‌లైన్ ట్రాన్సిట్ పాస్ విధానం అమలు చేస్తామని, గ్రామపంచాయతీ స్థాయిలో అవసరాన్ని నిర్ధారించి తహసీల్దార్ పర్యవేక్షణలో ఇసుక సరఫరా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు – కలెక్టర్ ఆదేశాలు




సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 26, ప్రతినిధి: రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో త్రాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతి ఇంటికి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 9 వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా 818 అవాసాలకు నీటి సరఫరా జరుగుతుందని, గ్రీన్, ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరీల ప్రకారం సరఫరా కొనసాగుతోందని తెలిపారు. ఆరెంజ్, ఎల్లో, రెడ్ కేటగిరీలో ఉన్న అవాసాలను గ్రీన్ కేటగిరీలోకి మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పంపులు, పైప్‌లైన్‌లు, ఓహెచ్ఆర్‌లలో లీకేజీలను వెంటనే సరిచేయడంతో పాటు మోటార్లు, హ్యాండ్‌పంపుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అవసరమైతే గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, క్లోరినేషన్ కోసం బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో మంచినీటి సహాయకులను నియమించి సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఏ పరిస్థితిలోనూ ఒక్కరోజు కూడా నీటి సరఫరా ఆగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు పథకాలు అందించాలి – ఎంపీడీవోకు వినతి పత్రం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 26, ప్రతినిధి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు మరియు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలని కోరుతూ చింతకాని మండల ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, వంకాయలపాటి లచ్చయ్య, వంకాయలపాటి సత్యం, పర్చగాని ఏడుకొండలు, పరిశుద్ధరావు, చాపలమడుగు వీరబాబు, పొనుగోటి రత్నాకర్, నన్నక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## గంటల్లోనే కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు – కుటుంబానికి సురక్షితంగా సిల్వరాజు



సందేశం టైమ్స్, ముదిగొండ, మార్చి 26, ప్రతినిధి: మండలంలోని పండ్రేగుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు పాము సిల్వరాజు కిడ్నాప్ ఘటనను ముదిగొండ పోలీసులు గంటల్లోనే ఛేదించి సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సిల్వరాజును గుర్తుతెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకుని అపహరించినట్లు సమాచారం అందడంతో సీఐ వడ్డేపల్లి మురళీ ఆధ్వర్యంలో పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలతో అన్వేషణ చేపట్టారు. వ్యూహాత్మక చర్యలతో తక్కువ సమయంలోనే ఆచూకీ తెలుసుకుని అపహరణదారులను పట్టుకుని సిల్వరాజును రక్షించారు. ఉదయం నుంచి ప్రాంతంలో నెలకొన్న ఆందోళనకు ముగింపు పలికిన పోలీసుల చర్యలను స్థానికులు ప్రశంసిస్తున్నారు. సీఐ మురళీ నేతృత్వంలో పోలీసులు చూపిన చురుకుదనం అభినందనీయమని జిల్లా పోలీసు శాఖ, మండల ప్రజలు పేర్కొన్నారు.

## వీరవెల్లి నాగేశ్వరరావుకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు



సందేశం టైమ్స్, కూసుమంచి, మార్చి 26, ప్రతినిధి: పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో జిల్లా నాయకుడు కీర్తిశేషులు వీరవెల్లి నాగేశ్వరరావు పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య నివాళులర్పించారు. ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారు నాగేశ్వరరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వేల్పుగొండలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం





సందేశం టైమ్స్, టేక్మాల్, మార్చి 26, ప్రతినిధి: మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని రామచలం కొండపై వెలసిన శ్రీ సీతారాముల దేవాలయంలో 42వ కళ్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రుస్తుంపేట శ్రీ ఆత్మనంద ఆశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకట స్వామి ఆశీస్సులతో నిర్వహించిన ఉత్సవాల్లో తొలి రోజు గణపతి పూజ, గోపూజ, గురుపూజ, స్వస్తివచనం, అఖండ దీపారాధనతో పాటు అగ్ని ప్రతిష్ఠ, అగ్ని హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చైత్ర శుద్ధ అష్టమి, నవమి సందర్భంగా రామమూల మంత్ర హవనాలు, యాగాలు, బలిప్రధానం, అభిషేకాలు, పూర్ణాహుతి, సీతారాముల కళ్యాణం, బోనాల ఊరేగింపు, పల్లకి సేవ వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ నిత్య అన్నదానం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# అమీన్పూర్‌లో జిహెచ్ఎంసి ఆకస్మిక చర్యలపై వ్యాపారుల ఆగ్రహం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అమీన్పూర్: అమీన్పూర్ మండల కేంద్రంలోని జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో మండే మార్కెట్ వద్ద తిరుమల ఎదురుభాగంలో జిహెచ్ఎంసి అధికారులు చేపట్టిన ఆకస్మిక చర్యలు చిన్న వ్యాపారుల మధ్య ఉద్రిక్తతకు కారణమయ్యాయి. దాదాపు 25 ఏళ్లుగా అక్కడే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న బండ్లు, టైరు పంచర్ షాపులు, చిన్న డబ్బాలు, మటన్ దుకాణాలను ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేయడం బాధితుల ఆగ్రహాన్ని పెంచింది. "సంవత్సరాలుగా ఇక్కడే వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషించుకున్నాం... ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేయడం అన్యాయం" అని బాధితులు వాపోయారు. కొంతమంది స్థానికులు అదే ప్రాంతంలోని కొన్ని ఇండ్లపై చర్యలు తీసుకోకపోవడం గురించి అధికారులతో వాగ్వాదానికి దిగారు. టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి చిన్న వ్యాపారులపై చర్యలు ఎందుకు? ఇండ్లను ఎందుకు వదిలారు? అని ప్రశ్నించారు. అధికారులు సమాధానం ఇవ్వకుండానే అక్కడినుంచి వెళ్లిపోవడంతో బాధితులు నష్టపరిహారం చెల్లించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# నల్లిమేట్ మృతుడి కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నల్లిమేట్ గ్రామానికి చెందిన బుచ్చి గారి నర్సింలు అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిన వెంటనే జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుజ్జపు మచ్చేందర్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ టీం సభ్యులు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, నల్లిమేట్ మాజీ సర్పంచ్ సత్యపాల్ రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాసంపల్లి అంజన్న, అశోక్, పవన్ రెడ్డి, నరసయ్య, యువ నాయకులు సందీప్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా మీర్జాపూర్‌లో ఉచితంగా సమస్యలకు పరిష్కారం చూపుతున్న జయమ్మ మాతాజీ



సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని బంగ్లా మీర్జాపూర్ గ్రామంలో నివసిస్తున్న శ్రీ శ్రీ శ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ ప్రజలకు ఉచితంగా వివిధ సమస్యలకు పరిష్కారం చూపుతూ గుర్తింపు పొందుతున్నారు. కుటుంబ, ఆరోగ్య, సంతాన, ఆర్థిక సమస్యలతో పాటు నరదృష్టి, ఇంటి దోషాలపై కూడా తన ఆధ్యాత్మిక సాధన, గ్రహణశక్తితో మార్గదర్శనం అందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. "ఎవరికి ఏ సమస్య ఉన్నా మాతాజీ గారు ముక్కుసూటిగా చెప్పి పరిష్కారం చూపిస్తున్నారు... ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సేవ చేయడం ఆమె ప్రత్యేకత" అని గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడైనా అందుబాటులో ఉండే జయమ్మ మాతాజీని ముందుగా ఫోన్ ద్వారా సంప్రదించి కలవాలని సూచిస్తున్నారు.



## తెలంగాణ వైద్య విధాన పరిషత్ రిపీల్ – డీఎస్‌హెచ్‌గా మార్పుతో మెరుగైన వైద్య సేవలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)ను రద్దు చేసి, దాన్ని సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ (DSH)గా మార్చినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసనసభలో వివరించారు. ఈ మార్పు ద్వారా ఉద్యోగులకు సమయానికి జీతాల చెల్లింపు, క్యాష్‌లెస్ వైద్యం, రూ.1.2 కోట్ల ప్రమాద బీమా, పూర్తి ప్రభుత్వ ఉద్యోగ హోదా లభించనున్నాయి. అదే సమయంలో రాష్ట్ర నలుమూలల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి హాస్పిటళ్లలో 16 స్పెషాలిటీ విభాగాలను, 8 కీలక విభాగాలను బలోపేతం చేస్తారని మంత్రి తెలిపారు.టీవీవీపీ పరిధిలో 184 హాస్పిటళ్లు, 12,720 బెడ్లు ఉన్నాయి. ఇక్కడ సగటున సంవత్సరానికి 1.2 కోట్ల మంది అవుట్‌పేషెంట్, 12 లక్షల మంది ఇన్‌పేషెంట్, 50 వేల మందికి శస్త్రచికిత్సలు, లక్షకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. డీఎస్‌హెచ్‌గా మార్పుతో కేంద్రం, జిల్లా, గ్రామ స్థాయిల్లో 80 శాతం వైద్య సేవలు అందించడం సులభం అవుతుంది, హైదరాబాద్‌కి వెళ్లాల్సిన అవసరం తగ్గి ప్రజల ఖర్చులు తగ్గుతాయని మంత్రి వివరించారు.ప్రస్తుతం 757 నర్సింగ్ ఆఫీసర్లు, 180 ల్యాబ్ టెక్నీషియన్లు, 48 ఫిజియోథెరపిస్ట్ పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 2,075 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు 9,572 పోస్టులు భర్తీ అయ్యాయని, ఇంకా 7,267 పోస్టులు భర్తీ దశలో ఉన్నాయని, 2027లో 2,929 పోస్టులకు నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు.అంతేకాక, ఐదు జిల్లా ఆసుపత్రుల్లో పీజీ మెడికల్ కాలేజీలు, డయాలసిస్ కేంద్రాల విస్తరణ, ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలు కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి స్పష్టం చేసినట్లుగా, ఉద్యోగులు మరింత భద్రతగా, సమర్థతతో ప్రజలకు సేవలు అందిస్తారని, ఈ మార్పు అదనపు ఖర్చు లేకుండా అత్యధిక ప్రయోజనం కలిగించే నిర్ణయం అని పేర్కొన్నారు.

## పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యతకు కఠిన పర్యవేక్షణలు



సందేశం టైమ్స్, ఆంధ్రప్రదేశ్, మార్చి 26, ప్రతినిధి: రాష్ట్రంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కీలక సూచనలు జారీ చేయబడ్డాయి. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు హెడ్ మాస్టర్ నామినేట్ చేసిన ఉపాధ్యాయుడు భోజనాన్ని ఖచ్చితంగా రుచి చూసి, LEAP యాప్‌లో భోజనానికి సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలి. తల్లిదండ్రులను కూడా భోజనంపై క్రమం తప్పకుండా ఫీడ్‌బ్యాక్ ఇవ్వమని ప్రోత్సహించాలి. వారానికి ఒకసారి MEOలు మరియు Dy.EOలతో ప్రజల అభిప్రాయం మరియు IVRS ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. కోడిగుడ్లు, చిక్కి, బియ్యం వంటి సరుకులు సకాలంలో అందించాలి, మరియు రసీదును హెడ్ మాస్టర్లు అందిన రోజే ధృవీకరించాలి. జిల్లా PMU విభాగం సరుకుల పంపిణీ, రసీదు ధృవీకరణను నిరంతరంగా పర్యవేక్షించాలి. అంతే కాకుండా, వంటవారు విద్యార్థులు భోజనం పూర్తిచేసే వరకు పాఠశాలలోనే ఉండాలి, తద్వారా భోజన నాణ్యత మరియు సమయపాలన క్షేమంగా కొనసాగుతుంది.

## మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద చిన్నారిపై రాళ్లు పడిన ప్రమాదం – ప్రభుత్వం వైఫల్యం



సందేశం టైమ్స్, ములుగు, మార్చి 26, ప్రతినిధి: ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఆడుకుంటున్న యువన్(6) అనే చిన్నారిపై ఇటీవల ప్రభుత్వం చేపట్టిన నాసిరకం పనులు ప్రమాదాన్ని సృష్టించాయి. మేడారం గద్దెల వద్ద భుజం మీద రాళ్లు వేసి నిపుణుల పర్యవేక్షణలోని పనులు జరుగుతున్న సమయంలో, డ్యూటీలో ఉన్న సమ్మక్క ప్రధాన పూజారి కుమారుడు యువన్ ఆ రాళ్ల కింద చిక్కుకుని రెండు చోట్ల కాళ్లలో తీవ్ర గాయాలు పొందాడు. వెంటనే స్థానికులు బాలుడిని అత్యవసర పరిస్థితిలో బయటకు తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై స్థానికులు ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, గద్దెల వద్ద పిల్లల భద్రతను, నిర్మాణ పనుల సమయంలో రక్షణా నియమాలను మరింత కఠినంగా పాటించాల్సిన అవసరాన్ని వ్యక్తం చేశారు. మేడారం ప్రాంతంలో భక్తులు తరచుగా వచ్చి సమ్మక్క సారలమ్మ పూజ చేస్తుంటే, పిల్లల రక్షణకు ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు.

## గీత కార్మికుల ప్రమాదాలకు పరిహారం ఎందుకు ఆలస్యమవుతోంది – హరీష్ రావు ప్రశ్న



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: గీత కార్మికులు చెట్టు మీద పని చేస్తుండగా పడిపోగా చనిపోతే రూ.5 లక్షల పరిహారం, శాశ్వత అంగవైకల్యం కలిగితే ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అయితే, సీఎం రేవంత్ రెడ్డి గతంలో రెండు రోజుల లోపల గీత కార్మికులకు ఆర్థిక సహాయం చేయనుందని ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ డబ్బులు ఎందుకు అందడం లేదని గీత కార్మికుల ప్రతినిధి హరీష్ రావు ప్రశ్నించారు. ఆయన అడిగినట్టే, ఈ ప్రభుత్వం వచ్చిన రెండున్నర సంవత్సరాల్లో గీత కార్మికులపై ఎన్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి, ఎవరికి ఆర్థిక సహాయం ఇచ్చారు, ఇంకా ఎవరికి ఇవ్వాల్సి ఉందో వివరించాలని, తద్వారా ఈ సమస్యకు తక్షణ పరిష్కారం రావాలని హరీష్ రావు మంత్రులకూ, సంబంధిత అధికారులకూ కోరారు.



## మహిళలకు 33% రిజర్వేషన్లు – OBC మహిళలకు సబ్-కోటా అవసరం: కవిత

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందించారు. మహిళలకు రిజర్వేషన్లు ఎంత ముఖ్యమో, OBC మహిళలకు సబ్-కోటా కల్పించడం కూడా అంతే ముఖ్యమని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాలకు మేలు చేసినప్పుడే అసలైన సామాజిక న్యాయం దక్కుతుందని కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులో OBC మహిళలకు సబ్ కోటా కేటాయించకపోతే, దేశవ్యాప్తంగా ఉద్యమం చేయడానికి సిద్ధమని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## అమెరికా శాంతి ప్రతిపాదనలపై ఇరాన్ ఆగ్రహం – సరిహద్దుల వద్ద సైనిక కదలికలు నమ్మకానికి విరుద్ధం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 26, ప్రతినిధి: అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్ల శాంతి చర్చల ప్రతిపాదనలను ఇరాన్ ఆమోదించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చర్చలు జరగాలని అమెరికా కోరుతున్నప్పటికీ, ఇరాన్ సరిహద్దుల వద్ద అమెరికా సైనిక బలగాలను మోహరిస్తోందని ఆరోపించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ బాకర్ ఖలీబాఫ్ తెలిపిన ప్రకారం, అమెరికా సైనిక కదలికలను తమ దేశం నిశితంగా గమనిస్తున్నది. ఈ చర్యలు ప్రాంతీయ నమ్మకానికి విరుద్ధంగా ఉండటం వల్ల, భవిష్యత్తులో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.




## పెట్రోల్ కొరతలోనూ సుఖవంతమైన ప్రయాణం – TGSRTC 30% రాయితీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 26, ప్రతినిధి: ప్రస్తుత యుద్ధ వాతావరణంలో పెట్రోల్ కొరత కారణంగా నగర వాహనదారులు ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో టికెట్ ధరలపై 30 శాతం రాయితీని అమలు చేస్తూ, ప్రయాణికులకు సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందించేందుకు సిద్ధమైందని వీసీ & ఎండి శ్రీ వై. నాగిరెడ్డి, ఐపీఎస్ గారు తెలిపారు.

ఎండీ నాగిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చి, “పెట్రోల్ ఇబ్బందులు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండగా..!” అని చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా నాలుగు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయని ఆయన వివరించారు:

సమయం & ఇంధనం ఆదా: పెట్రోల్ కోసం కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిలబడకుండానే వేగంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు.

ఇంధన పొదుపు – దేశాభివృద్ధికి మలుపు: వ్యక్తిగత వాహనాలను పక్కన పెట్టి ప్రజా రవాణా ఉపయోగించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేసి, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుంది.

పర్యావరణానికి మేలు – కాలుష్య రహిత ప్రయాణం: రోడ్ల రద్దీ తగ్గి, ట్రాఫిక్ సమస్యలు మరియు కాలుష్యం తగ్గుతాయి; ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రయాణం పర్యావరణ రక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి అవుతారు.

జేబుకు హాయి – ప్రయాణం సుఖవంతం: సాధారణంగా ఖరీదు అనిపించే ఏసీ బస్సులలో 30% రాయితీ, ప్రజలకు లగ్జరీ ప్రయాణాన్ని తక్కువ ధరకే అందిస్తుంది.

శ్రీ వై. నాగిరెడ్డి ఐపీఎస్ గారు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు: “బంకుల వద్ద బారులు తీరొద్దు... సేఫ్ గా బస్సెక్కండి... సుఖవంతమైన ప్రయాణం చెయ్యండి.” నగర వాసులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ట్రాఫిక్ మరియు పెట్రోల్ ఇబ్బందుల నుండి బయటపడాలని టీజీఎస్ఆర్టీసీ ఆకాంక్షించింది.




## నిమ్జ్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి వేగం సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూముల అనుసంధానం, రహదారులు మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళిక రూపొందించేందుకు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. టీజీఐఐసీ, నిమ్జ్/ఎన్ఐసీడీసీ పరిధిలోని భూముల అభివృద్ధిపై జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి నిమ్జ్, రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, లేఅవుట్ ప్రకారం రహదారులు, విద్యుత్, నీటి వంటి మౌలిక వసతుల కల్పనకు అనుగుణంగా సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా శాంతియుతంగా సర్వే పనులు నిర్వహించేందుకు రెవెన్యూ, సర్వే, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కొలతలతో పనులు పూర్తి చేయాలని, భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, భూ స్వాధీనం, అడ్వాన్స్ పొజెషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియలపై సమీక్షించి వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ పాఠశాలల్లో వైద్య శిబిరాలు – మార్క్స్ నగర్ UPHCలో స్పెషలిస్ట్ సేవలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (RBSK) మరియు టీవీవీపీ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మార్చి 26న వివిధ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విస్తృత స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సదాశివపేట, లింగంపల్లి TSRIES, కేజీబీవీ, సంగారెడ్డి TSRIES, కల్హేర్ మినీ గురుకులం, నాగల్ గిద్ద TWRIES, పటాన్చెరు, ఇస్నాపూర్, అల్లోల్, రాయికోడ్, అందోల్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలు విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, కంటి, చెవి, దంత సమస్యలు, పోషకాహార లోపాలను గుర్తించి తక్షణ చికిత్స అందిస్తాయి. అవసరమైతే ఉన్నత వైద్య సేవలకు రిఫర్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే సంగారెడ్డి పట్టణంలోని మార్క్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (UPHC)లో కూడా స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రత్యేక శిబిరం నిర్వహించబడనుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.




## సంక్షేమ వసతి గృహాల్లో పూర్తి సౌకర్యాలు, నాణ్యమైన విద్య తప్పనిసరి ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు సమగ్ర వసతి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో పర్యటించిన ఆమె ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, శిశు సంక్షేమ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వసతి గృహాల మౌలిక వసతులు, భోజన నాణ్యత, పరిశుభ్రత, భద్రత అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూములు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సమయానికి అందుతున్నదానిపై ఆరా తీశారు. అలాగే పోక్సో కేసులు, మానవ అక్రమ రవాణా నియంత్రణ, భూ నిర్వహణ చట్టాల అమలు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో డీఎస్పీ, ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల అనుమతులు వేగవంతంగా జారీ చేయాలి – కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు వేగవంతంగా జారీ చేసి పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రీ ప్రమోషన్ కమిటీ సమావేశంలో టీజీ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులు, క్లియరెన్సులు, ప్రోత్సాహకాల మంజూరు, శాఖల అనుమతులు, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువులో దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు పెండింగ్ ఫైల్స్‌ను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి పరిశ్రమలకు అవసరమైన అన్ని అనుమతులను పారదర్శకంగా, సమయానికి అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కోల్, ఇథనాల్ ముడిపదార్థాల కేటాయింపు, ఎస్సీ, ఎస్టీ–టీప్రైడ్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, ఫ్యాక్టరీల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, టీజీఐఐసీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పలు దరఖాస్తులను ఆమోదించినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, కాలుష్య నియంత్రణ మండలి మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీఎం సేతు ద్వారా ఐటీఐల ఆధునీకరణ... నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం – కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం సేతు కార్యక్రమం ద్వారా ఐటీఐలను బలోపేతం చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పథకం అమలు విధానాలపై చర్చించారు. ఐటీఐల అభివృద్ధికి నిధుల కేటాయింపు, మౌలిక వసతుల మెరుగుదల, పరిశ్రమలతో అనుసంధానం, శిక్షణ నాణ్యతపై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం సేతు ద్వారా యువతలో నైపుణ్యాలు పెంపొందించి పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు. క్లస్టర్ విధానంలో ఐటీఐలను హబ్, స్పోక్ కేంద్రాలుగా అభివృద్ధి చేసి అధునాతన యంత్రాలు, ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు వివరించగా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించాలనీ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐటీఐ ప్రిన్సిపల్స్ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ రావు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నల్లపోచమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు... రూ.6.30 లక్షల ఆదాయం

సందేశం టైమ్స్, మనూర్ మండల్, మార్చి 26, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం పరిధిలోని బోరంచ గ్రామ శివారులో మంజీర నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీలను బుధవారం లెక్కింపు చేశారు. దేవాదాయ శాఖ సంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్ రంగారావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివ రుద్రప్ప, మానూర్ ఏఎస్ఐ గోవింద నాయక్, పోలీస్ సిబ్బంది, దేవస్థానం చైర్మన్ మల్లయ్య, ప్రధాన అర్చకులు, ఎక్స్ ఆఫీస్ మెంబర్ శ్రీకాంత్ స్వామి మరియు దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివ రుద్రప్ప తెలిపారు, భక్తుల సమర్పించిన హుండీ కానుకల ద్వారా మొత్తం రూ.6,30,832 ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ అర్చకులు సిద్ధు స్వామి, నాగేష్ స్వామి, ప్రవీణ్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో కొప్పుల శేషారెడ్డి హాజరు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: అల్లాదుర్గ్ మండలం పెద్దపూర్ గ్రామంలోని చెన్నగోరి బాగేశ్ గారి ఇంటిలో నిర్మించిన "ఇందిరమ్మ ఇల్లు" గృహప్రవేశ వేడుకలకు ముఖ్య అతిథులుగా అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి హాజరై ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి ఆధ్వర్యంలో ప్రతీ పేదవానికి సొంత ఇంటి కల నిజం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ ఇళ్లు" పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ చంద్రశేఖర్, ఏఈ అక్రమ్, పంచాయతీ కార్యదర్శి రాములు, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలకిషన్, మాజీ ఎంపిటిసి విట్టల్ రెడ్డి, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, స్థానిక సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 14–15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 26, ప్రతినిధి: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో కీలకమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సంగారెడ్డి జిల్లాలోని 14–15 సంవత్సరాల బాలికలందరికీ మిషన్ మోడ్‌లో అందించాలన్న సూచనతో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అమలు, మహిళా స్వయం సహాయక సంఘాల హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టే వైద్య శిబిరాలపై చర్చలు జరిగాయి. కలెక్టర్ తెలిపారు, 14–15 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హ బాలికలకు వ్యాక్సిన్ తప్పనిసరిగా అందించబడాలి. స్థానిక పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు బాలికలను తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, మిషన్ మోడ్‌లో సమగ్ర వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి డీఆర్‌డీఓఏ, మెప్మా, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్ సిబ్బంది సమన్వయం చేయాలని, పీహెచ్‌సీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీపీ, ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా వైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.